# మళ్లీ యెప్పుడో... మళ్లీయెక్కడో....

రైలు రేణిగుంట స్టేషను దాటి తిరుపతికి చేరువవుతూండగా "యేమయిందిసరళా? యెందుకంత డల్‌గావున్నావు?" అని మరోసారి అడిగాడు రమణ.

యేమీలేదన్నట్టుగా తలతిప్పి, పాపాయిని వొళ్ళో సరిగా పడుకోబెట్టుకునే మిషతో చూపులు మరల్చుకుంది సరళ.

కిటికీలోంచీ శేషాద్రి కొండల్ని ఆశక్తిగా చూస్తూ "తిరుపతికి రావాలని మన పెళ్ళయినప్పటినుంచీ అడుగుతున్నది నువ్వేగదా! తీరా వస్తున్నప్పుడు నువ్వింత మూడీగా వుండడం నాకేంబాగలేదు" అంటూ తానూ ముఖం ముడుచుకున్నాడు రమణ.

"నా కోసం వస్తున్నారా యిప్పుడు? మీ ఫ్రెండు పెళ్ళికని వస్తున్నారు." సరళ గొంతు రైలుకూతకు ప్రతిధ్వనిలా పెద్దగానే వినిపించింది.

రమణ వులిక్కిపడి, అంతలో కంగారును కప్పిపుచ్చుకునే ప్రయత్నంచేస్తూ "మా బ్యాంకులో యిప్పుడైనా సరిగ్గా లీవు దొరికిందా? మెడికల్ సర్టిఫికెట్టు యిచ్చి యీ లీవు సాంక్షన్ చేయించుకునేసరికి తలప్రాణం తోకకొచ్చింది." అన్నాడు. తర్వాత గొంతు సవరించుకుని "యెవరికోసం వస్తేనేంచెప్పు! వుయ్ హావ్ టూ టేక్ ది లైఫ్ యాజ్ యిట్ కమ్సుటూ అజ్. దొరికిన అవకాశాన్ని వాడుకోవాలి..అంతే! తిరుపతిలో నీకెలా యిష్టం వస్తే అలాగే తిరుగుదాం. వోకేనా..." అని అనునయంగా అడిగాడు.

"మాటలకేంలెండి..." అంటూ సరళ ముక్కుచీదింది.

"మాట వరసకేంగాదు..ప్రామిస్..." రమణ ప్రాధేయపడ్డాడు.

"అదీచూస్తాను." అంటూ సరళ సవాలు చేస్తున్నట్టుగా చూసింది.

ఆవిడ చూపుల్లో కనిపించిన కోపానికి రమణ వులిక్కిపడ్డాడు. తడబడిపోతూ సూట్‌కేసును గట్టిగా పట్టుకున్నాడు....రైలు వేగాన్ని తగ్గించుకుంటూ ఫ్లాట్‌ఫాంపై కొచ్చి గసలుబోసుకుంటూ ఆగింది.

పాపాయిని మాత్రం భుజానేసుకుని సరళ సరాసరి కంపార్టుమెంటు గేటు దగ్గరికి నడిచింది. వో చేత్తో సూట్‌కేసూ, మరోచేత్తో బాస్కెట్టూ పట్టుకుని నీరసంగా ఆమె వెంటే నడచాడు రమణ. రైల్లోంచీ వచ్చిన వ్యక్తులందరూ ముందుగా ప్లాట్‌ఫాంపైకి దిగడానికి పోటీపడుతున్నారు. ప్లాట్‌ఫాం పైన దిగిన ప్రయాణీకులు అన్ని వైపులకూ నడుస్తూ రణగొణధ్వనుల్ని తయారు చేస్తున్నారు.

జేబులోంచీ టికెట్టుతీసి యివ్వడంకోసం బాస్కెట్‌ను కిందికిదించాడు రమణ. సరళ వెనుదిరిగి చూడకుండా టీసీని దాటి ముందుకెళ్ళిపోయింది. జనాల మధ్యలో ఆమె తప్పిపోతుందేమోనన్న భయంతో టికెట్టును టీసీ చేతుల్లోకి విసిరేసి, మళ్లీ బాస్కెట్‌ను చేతికందుకుని ముందుకు పరిగెత్తాడు రమణ... అప్పటికే సరళ రైల్వేస్టేషనుదాటి రోడ్డుపైకెళ్ళిపోయింది.

"మనం వెళ్ళాల్సింది తిరుచానూరుకు... పెండ్లిమండపం తోలప్పగార్డన్సు"....అంటూ రమణ గసబోస్తూనే అరిచాడు.

"పెళ్ళిరేపు... మనం సాయంత్రం తిరుచానూరుకెళ్తేచాలు... యీ పక్కనే వుంది లాడ్జీ... ముందక్కడ దిగదాం పదండి" సరళ రోడ్డుదాటి, మలుపుతిరిగి, సూటిగా లాడ్జికేసి నడుస్తోంది... ఆమె లాంజ్‌లో కూర్చుని రిసెప్షనుకేసి చేయిచాపింది.

"ఆ మాత్రం తెలియదా నాకు?" అని గొణుగుతూ రిసెప్షనుటేబులు దగ్గరికెళ్ళాడు రమణ... విజటర్స్ పుస్తకంలో చిరునామా రాసేసరికి బాయ్ వచ్చి సామాన్లందుకున్నాడు. మెట్లెక్కి రెండో అంతస్థులో డబుల్‌రూం తాళం తెరిచాడు. సరళ తాపీగా గదిలోకొచ్చి "మంచినీళ్ళు తెచ్చిపెట్టు... రూంలో హీటరుందా? వేడినీళ్ళు వస్తాయా?" అని బాయ్‌ని ప్రశ్నలతో ముంచెత్తింది....

నిద్రపోతున్న పాపాయిని బెడ్‌పైన పడుకోబెట్టాక, సోపూ, టవలూ తీసుకుని బాత్రూంలోకెళ్ళిపోయింది సరళ... సూట్‌కేసులోంచీ లుంగీ తీసి కట్టుకుని, టేబుల్‌పైన పడున్న దినపత్రికను తిప్పసాగాడు రమణ...

పదిహేను నిముషాల్లో బయటికొచ్చిన సరళ "బ్రష్ కూడా చేసేశాను. స్నానమయిపొయ్యింది. మీరేలేటు" అంటూ భర్తకేసి చూసి మెల్లగా నవ్వింది.

"అమ్మయ్య! బతికించావ్!" రమణ వుత్సాహంతో పిల్లాడిలా కేరింతలు కొట్టాడు. "నువ్వికపైన నవ్వనే నవ్వవేమో అని భయపడిచస్తున్నానింతవరకూ! యింక పర్వాలేదు... యీ వుత్సాహంతో యింకో నెల బతికేయచ్చు" అన్నాడు.

"త్వరగా స్నానం కానివ్వండి...తిరుపతిలో అలిగేటంత టయింలేదు నాకు...." అంటూ సరళ మళ్లీ ముఖం ముడిచేసింది.

రమణ పరుగునా బాత్రూంలోకి దూరేశాడు. వేడినీళ్ళ స్నానంతో వొళ్ళు తేలిక పడ్డాక, దుస్తులు మార్చుకుంటూ "యిప్పుడుచెప్పు! సాయంత్రం వరకూ ఖాళీ మనం...యిప్పుడేంచెయ్యాలి"? అని సరదాగా అడిగాడు.

"చెప్పకుంటే నావెంటరావడం కుదరదా?" సరళ తీక్షణంగా చూస్తోంది.

"కుదరదంటే వొంటరిగానే వెళ్ళిపోతావా యేం?" రమణ విస్తుపోయాడు.

"మొగుడనేవాడు రాయీ రప్పాగాదు. వాడూ మనిషే? నీకేమో నీ సామాన్లు మోయడానికి పోర్టరుకావాలి. వెన్నంటి వుండడానికి బాడీగార్డుండాలి. సంపాదించి పోషించడానికో మనిషిదొరకాలి. యిందర్ని వేర్వేరుగా అపాయింట్ చేసుకుంటే డబ్బు దండగవుతుందని, మొగుడ్ని సెలక్టుచేసుకున్నావు. అయితే కొంచెం వోపికపట్టుంటే బావుండేది. చెప్పినపని చెప్పినట్టుగా చేసే రాబోట్లు మార్కెట్లోకి వస్తాయంటున్నారు అవి యీ మొగళ్ళ కంటే చీపండ్ బెస్ట్....అవి నువ్వు చెప్తే గానీ స్వంతంగా ఆలోచించవు..."

"మనం యిప్పుడు యెస్పీడబ్లూ కెళ్తున్నాం!" సరళ టక్కున అడ్డుతగిలింది.

"జనరల్ నాలెడ్జ్‌లో నేను వీకు... యీ అబ్రివేషను నాకు తెలియదు.." రమణ వోరచూపులు చూశాడు.

"శ్రీపద్మావతీ వుమెన్స్ కాలేజీ..." బయల్దేరబోతూ పైకెత్తుకునే సరికి పాపాయి వులిక్కిపడి యేడవసాగింది. దాన్ని భుజానేసుకుని సముదాయిస్తూ సరళ గదిలోంచీ బయటికెళ్ళిపోయింది.

రమణ పాపాయి సామాన్లున్న బుట్టను చేతికెత్తుకుని, గదితలుపులకు బీగంతగిలించి, మెట్లుదిగి కిందికొచ్చాడు. రిసెప్షనులో తాళం చెవులప్పగించాక రోడ్డుపైకొచ్చాడు.

"యిదోపెద్దయినా! వొకేమాట చెప్తావుండాను. మేము పిల్‌గ్రిమ్స్‌గాదు..మాది యీ వూరే... యెస్పీడబ్లూకు మేము మామూలుగా యిచ్చేది రెండున్నరే! నువ్వు మూడిమ్మంటే వొప్పుకోను..." సరళ రిక్షావాలాతో బేరంచేస్తోంది.

"కడా మాటమ్మా! రెండుంముక్కాలు..." రిక్షావాలా వెనక్కు తగ్గలేదు. రమణ రిక్షాలోకెక్కికూచున్నాడు.

"సరేపద!" సరళ భర్తకేసి కోపంగా చూస్తూ రిక్షా పైకెక్కింది. రోడ్డుపైన వుదయపురద్దీ పెద్దగా కారుబారుచేస్తోంది. అంబాసిడరుకార్లు రెండు వొకదాని వెంటవొకటి పరిగెడుతున్నాయి. సైకిల్లూ, స్కూటర్లూ అటూయిటూ దూసుకెళ్తున్నాయి.

"వుమెన్స్ కాలేజీలో యెవర్ని కలవాలి?" రమణ వీలయినంత యధాలాపంగా అడగడానికి ప్రయత్నించాడు.

ఆమె పెద్దగా పెదవులు చప్పరించింది.

"నీ ఫ్రెండ్సెవరైనా వున్నారా అక్కడ?" రమణ యీసారి ఆశక్తిని దాచుకోలేకపోయాడు.

ఆమెలేరన్నట్టుగా తలతిప్పింది.

"అయితే యిప్పుడక్కడికెందుకెళ్ళడం?" రమణ కోప్పడ్డాడు.

ఆమె వురిమిచూసింది. ఆమె కళ్ళల్లో గిర్రున తిరుగుతున్న కన్నీళ్ళనుచూసి రమణ కంగారుపడిపోయాడు...

"పెద్దాయినా...కొంచెముందు....యిక్కడ కొంచేపాపు.." అంటూ సరళ పెద్దగా కేకేసింది. పాపాయిని రమణవొళ్ళోకుదేసి, రిక్షా ఆగీ ఆగకమునుపే కిందికి దూకి, రోడ్డుపక్కనున్న కిళ్ళీకొట్టు దగ్గరికి సరసరానడచింది. కస్టమరుకు సిగరెట్లందిస్తూన్న షాపతనితో" "యీ బంకులో రామూ అని వొక పిల్లోడుండేటోడు...అయిదేళ్ళకుముందు..." అని వాకబుచేసింది.

షాపతను ఆమెకేసి కళ్ళార్పకుండా చూసి "రామూనా! తెలియదు." అన్నాడు.

"సన్నగా, పొడుగ్గా, చిన్న వుచ్చు గడ్డంతో, యెప్పుడూ నవ్వుతావుండే పిల్లోడు" సరళ గుర్తులు చెప్పసాగింది.

"తెలియదు...మావోనరొస్తే అడగండి" షాపతను మరో కస్టమరువైపుకు తిరిగేశాడు.

"యీ వారం ప్రభ యీ..."సరళ అతడ్ని మరోవైపు నుంచీ అటకాయించింది.

షాపతను ఆంధ్రప్రభను తీసిచ్చి "అరవైపైసలు..." అన్నాడు.

సరళ రిక్షాలో కొచ్చి కూర్చుంటూ "అరవై పైసలిచ్చేయండి" అంది. రమణ కిందికి దిగి కిళ్ళీకొట్టతడికి డబ్బులిచ్చేసి వచ్చాడు.

రిక్షా కదులుతూండగా "వీక్లీ కొనుక్కోవాలంటే గూడా మిమ్మల్నడగాలా?" అంటూ రెట్టించింది సరళ.

రమణ అవిడకేసి ఆశ్చర్యంగా చూసి, ఆ తరువాత మౌనంగా వుండిపోయాడు.

"పాపం, రామూ యేమయిపోయాడో! మాకోసమని వీక్లీలన్నీ తీసి పెట్టేవాడు. మేమెంత లేటుగా వచ్చినా మాకిచ్చేవాడు... మంచోడు..." సరళ తనలోతాను వాపోసాగింది.

"మీ హాస్టల్లో మీకు వీక్లీలు దొరికేవికావా?" రమణ అసహనంగా అడ్డుతగిలాడు.

"మాగ్జయన్లు హాస్టల్లోనా? చంపేసారు. యింకేమైనా వుందా?" సరళ కళ్ళు పెద్దవిచేసుకుని, ముఖమంతా జేవురిస్తుండగా వుద్రేకపడిపోయింది "యెవరైనా వీక్లీలూ,

నావెల్సూ చదువుతూ కనిపిస్తే మా సత్యవతి మిస్ యెగిరిగంతేసేది. వారాని కోసారి మాత్రమే వూర్లోకి షాపింగుకు పర్మిషనిచ్చేది. అప్పుడు దొంగతనంగా పుస్తకాలు తెచ్చుకునేవాళ్ళం. అయితే మా సత్యవతి మిస్సుది పిల్లికళ్ళు. యెంత జాగ్రత్తపడినా కనిపెట్టేసేది. షాపింగుకు ససేమిరా అనేది. అయితే మేమేమైనా తక్కువ తిన్నామా? మా స్వప్న వాళ్ళ డాడీ దగ్గరినుంచీ పర్మిషను అప్లికేషను పెట్టించేది. జామ్మని ఫ్రెండింటికెళ్తున్నట్టుగా మేమంతా చెక్కేసే వాళ్ళం! తెల్లవారి మార్నింగ్‌షో, మధ్యానం భీమాస్‌లో లంచ్, మళ్ళీ మాట్నీ, సాయంత్రం షాపింగ్, హాస్టలు చేరే సరికెప్పుడో అటెండెన్సు తీసేసుంటారు. సత్యవతి మిస్‌తో బొటాబొటీ జగడం... రాత్రంతా డిస్కషన్స్... మళ్లీ వచ్చేవారందాకా వొకటే పాలిటిక్సు..." వూపిరి తిప్పుకోవడం కోసం సరళ కాస్సేపాగింది.

"తెలియకుండా రౌడీని పెండ్లి చేసుకున్నాన్నేను" రమణ స్వగతంలా గొణిగాడు.

"హాస్టల్లో మా గ్రూపుకు అదే పేరు..." సరళ మరింత వుత్సాహంగా అందుకుంది "రౌడీగాంగ్... డేంజరస్ సిక్స్... అది సత్యవతి మిస్సు మాకిచ్చిన టైటిలు...చాలనిదానికి రెండునెలలకొకసారైనా మా ఆరుమంది యిండ్లకూ కంప్లయింటు లెటర్లు రాసేది. 'యేమిటేమొద్దూ! అల్లరి చేస్తున్నావంటోంది మీ వార్డెను' - అని అడిగేవాడు నాన్న. 'ఆమెపెద్ద సాడిస్టులే నాన్నా!' అనేదాన్ని. నాన్నెంత పెద్దగా నవ్వేవాడో తెలుసా? అమ్మేమోకసిరేది. 'ఆడపిల్లలు ఆడపిల్లల్లాగే వుండాలే!" అని తిట్టేది. నాన్నేమో 'యిది మగవాడిగా పుట్టుండాల్సిందే!' అనేవాడు. సెలవులివ్వగానే నేను రైలెక్కి వూరికెళ్ళిపోయేదాన్ని! నాకేంభయం? నన్నుచూస్తే మగపిల్లలే భయపడేవాళ్ళు!"

రెండువైపులా పెద్దపెద్ద అంగళ్ళున్న గాంధీరోడ్డు మీదుగా రిక్షా బాలాజీ కాలనీ సరిహద్దును దాటి కాలేజీ రోడ్డును సమీపించింది. తరువాత మలుపుతిరిగింది.

"గాడ్! యిదేమిటి?" పాపాయిని మళ్ళీ భర్తవొళ్ళోపెడుతూ రిక్షాలోనే యెగిరి దూకినంత పనిచేసింది సరళ. "యిక్కడొక పెద్ద చెరువుండేది. మేం దానికి మానససరోవరమని పేరుబెట్టాం...రెండేళ్ళలో అదేమయ్యిందో చూడండి. దానిచోటులో యిప్పుడీ గెస్టుహవుసు అవసరమా చెప్పండి?"

"యేమిటా దూకుడు? చిన్న పిల్లననుకుంటున్నావా యింకా?" రమణ పెద్దగా మందలించాడు.

"యిక్కడ రైలు రోడ్డుకడ్డంగా యీగేట్లెప్పుడు పెట్టారు?" రైలు రోడ్డును దాటుతూనే సరళ రిక్షాలోంచీ కిందికి దూకేసింది. "వోసారి యాక్సిడెంటు జరిగిందని చెప్పాను

గదానేను.? యిక్కడే జరిగిందది. రిక్షాను రైలుగుద్దేసింది. యిద్దరు స్టూడెంట్లు స్పాట్‌డెడ్... పెద్దట్రాజెడీ..అందుకేనేమో యిప్పుడీగేట్లు పెట్టారు..."

"నా బాడిగ నాకిచ్చెయ్యండమ్మా! రాయలసీమ టయమైపోతా వుండాది....నేను పోవాల్ల" రిక్షావాలా అడ్డుతగిలాడు.

సరళ అతడిని పట్టించుకోకుండా, పాపాయినెత్తుకుని చకచకా ముందుకెళ్ళిపోయింది. రిక్షావాలాకు డబ్బులిచ్చేశాక బాస్కెట్టు నెత్తుకుని రమణ అడుగులు సారించాడు.

జైలు గోడల్లాంటి యెత్తయిన ప్రహరీ లోపలి భవనం రాతి గోడలతో కోటలా కనబడుతోంది. ప్రహరీలోపల వరసగా నిల్చున్న అశోకచెట్లు పహరా గాస్తున్న సైనికుల్లాగున్నాయి. భీకరమైన ప్రహరీ తలుపులకవతల ఆక్వేరియంలో కదిలే చేపపిల్లల్లా ఆడపిల్లలు అటూయిటూ తిరుగుతున్నారు. దూరంగా నడచిపోతున్న భార్యనే చూస్తూ రమణ ద్వారంలోంచీ లోపలి కెళ్ళబోయాడు.

"ఠైరో... ఠైరో... కహాజానా?" ఘూర్ఖా ముందుకొచ్చాడు.

"మా ఆవిడ... నాభార్య...మై వైఫ్...." రమణ నిస్సహాయంగా భార్యకేసి చేయిచాపాడు.

ఘూర్ఖా అర్థమయినట్టుగా తలవూపి "జెంట్స్‌కు పర్మిషన్ లేదుసార్!" అన్నాడు. "రమణ బాస్కెట్‌ను చూపెట్టాక" బేబీ...బేబీ..." అని పాపాయిని చూపెట్టాడు.

"అక్కడే ఆగిపోయారా మీరు?" దూరంనుంచీ విసుక్కుంటూ సరళ తిరిగొచ్చింది. "హలో మున్నాబాయ్! మా ఆయన్ని ఆపేశావా నువ్వు? అవునూ, నీకీ ప్రమోషనెప్పు డొచ్చింది? రాంలాల్ యేమయినాడు?"

ఘూర్ఖా సరళకేసి అయోమయంగా చూశాడు.

"నన్ను గుర్తుపట్టలేదా నువ్వు! సరిసర్లే! లోపలకెళ్ళొచ్చాక నీతో తీరిగ్గా మాట్లాడతాన్లే! మా వారిని లోపలికి వదలిపెట్టు... సత్యవతీ మిస్సును కలవాలి... ఆమె ఆఫీసుకేలే..."

రమణ లోపలికొచ్చి భార్యవెంట వరండా మెట్లెక్కసాగాడు.

చుట్టూ తిరుగుతున్న ఆడపిల్లలందరూ తననదోలా చూస్తున్నట్టుగా అనిపించగానే అతను కంగారు పడసాగాడు. చేతిలోని బాస్కెట్ బరువెక్కిపోతున్నట్టుగా అనిపించడంతో రొప్పసాగాడు.

వరండాలో నడుస్తున్న ఆడపిల్లల్ని పట్టించుకోకుండా క్లాసు రూముల్లోపల మేడమ్‌లు పాఠాలు చెప్పేస్తున్నారు. కాలేజీ భవనం లోపలున్న గార్డెను నిండా ఆడపిల్లలు సీతాకోకచిలుకల్లా చెడతిరుగుతున్నారు. మెడకో గడియారం వేలాడుతున్నట్టుగా రమణ గుండె దడ దడ మోగసాగింది.

"అక్కడే నిలబడ్డారా మీరు! రండి రండి! యిదే మా రాజ్యం. అదిగో, ఆ లాన్సులో వుండే సిమెంట్ బెంచీ మాపర్మినెంటు ప్లేసు. అదిగో, ఆ మూలున్న త్రీనాట్ వన్ రూమే మా క్లాస్రూం. క్లాసవుతూనే అందరూ బయటికొచ్చి ఆ వరండాగోడ పక్కన నిలబడి కబుర్లు చెప్పుకునేవాళ్ళం. అటుచూడండి. అదే వోపనేర్ స్టేజీ. సెకండియర్లో అక్కడే మేం "చచ్చిబతికిన జీవాలు" నాటకం వేశాం. అప్పట్నుంచే మా జయను అందరూ సుప్రీమ్ హీరో అనిపిలిచేవాళ్ళు! ఆ రోజెంత తమాషా జరిగిందనుకున్నారు? రాజు దగ్గరినుంచీ పాంటూ షర్టూ తెప్పించాం. అసలు రాజెవరో తెలుసా మీకు? నాకు తెలుసు, మీరు మరచిపోయివుంటారు. రాజు మా సుజాత కజిన్ బ్రదరు. విజిటింగవర్సులో తెచ్చిచ్చాడు. తీరా ఫంక్షనుకు ముందు తొడుక్కుని చూస్తే చొక్కా మోకాళ్ళదాకా వచ్చింది. యేం చెయ్యాలి? సరేలెమ్మని షర్టు టక్కుచేసుకుని స్టేజీ యెక్కింది. లూజు లూజు చొక్కా ఫిట్ పాంటూ – రోమియోలా తయారయ్యింది. నాటకాన్ని షేక్స్ పియర్ రోజులకు లాక్కెళ్ళ పోయామని మా సుగుణాచౌదరి మిస్సువొకటే యేడుపు..."

లాబ్సులో వోవరాల్స్ తొడుక్కున్న విద్యార్థినులు రంగురంగుల సీసాలతో యేవో ప్రయోగాలు చేసుకుంటున్నారు. వరండాలో తిరుగుతున్న అమ్మాయిలు యెవరో పిలుస్తున్నట్టుగా పరిగెడుతున్నారు. లాన్సులో కూర్చున్న ఆడపిల్లలు కాలచక్రాన్ని ఆపే ప్రయత్నం చేస్తున్నారు..పరికిణీలూ, చీరలూ, పంజాబీడ్రస్సులూ, స్కర్టులూ..మగపురుగున్న జాడెక్కడా కనబడడంలేదు.

"సరళా, సరళా! నేను బయటికెళ్ళిపోతాను. గేట్ దగ్గరుంటాను. నువ్వు నీపని పూర్తయ్యాక బయిటికిరా! అంతవరకూ వెయిట్చేస్తాను" అన్నాడు రమణ యేడుపు ముఖంపెట్టుకుని.

"బయటికా? భలేవారే! రండి... రండి..." సరళ నడిచిపోతూనే వుంది. "యిది తెలుగు డిపార్టుమెంటు. ఆ ముందున్నదే యింగ్లీషు. అటువైపే హిస్టరీ... మా సత్యవతి మిస్సుది హిస్టరీ... భలేస్ట్రిక్టు... క్లాసుజరిగేటప్పుడు బయటతిరిగితే చంపేసేది. కానీ పాపం, పెళ్ళిగాలేదు... వాడెవడో బతికిపోయాడని మేమంతా చాటుగా నవ్వుకునేవాళ్ళం." సరళ హిస్టరీ డిపార్టుమెంటులోకి దూరిపోయింది.

రమణ వోస్తంభం చాటుకెళ్ళి నిల్చుని, చుట్టూ బిత్తరచూపులు సారించాడు.

యెక్కడి నుంచో గంటమోగింది. క్లాసుల్లోంచీ మేడమ్లు బయటికొచ్చారు. వెంటనే స్టూడెంట్లూ వరండాలో కొచ్చేశారు..

"యేయ్ మిస్టర్! యెవరు నువ్వు? యిక్కడెందుకున్నావ్?" హెవీ వెయిట్ చాంపియన్లా కనిపిస్తున్న నడివయసు స్త్రీ అటకాయించింది.

"మరండీ... మా మిసెస్... నేను" రమణ బెంబేలు పడిపోయాడు.

"యిలా యెక్కడ పడితే అక్కడి కొచ్చేయడానికిది మెన్స్‌కాలేజీ గాదు. వుమెన్సుకాలేజీ... యెవరు కావాలి నీకు?" అవిడ గద్దించింది.

రమణ యెటూ పాలుపోక చేతుల్లోని బాస్కెట్‌ను ముందుకుచాపాడు. తరువాత అర్థంగాని మాటలేవో గొణుగుతూ బాస్కెట్లోంచీ పాలసీసాను పైకి తీసి చూపెట్టాడు. ఆవిడ యింకా వురిమిచూస్తూనే వుంటే "వార్డెను. వార్డెను" అని పలవరించాడు.

"వార్డెను రూం ఆ సైడులోవుంది. కదులుముందు...ప్లీజ్‌మూవాన్....ఐ విల్ రిపోర్ట్ యిట్ టు ది ప్రిన్స్‌పాల్..." ఆవిడ అతణ్ణి తరుముతున్నట్టుగా ముందుకు కదిలింది.

ఆవిడ కారిడార్‌లో మలుపుతిరుగుతూనే వెనక్కుతిరిగి పక్కకు చూశాడు రమణ. సరళ వెనకేవచ్చి "చూశారా, ఆమే మా తెలుగుమిస్సు...సుధారాణి ... నన్ను గుర్తు పట్టలేదనుకోండి...మహాటెక్కు...నేను మాత్రం యెందుకు విష్ చేయాలి? ఆమెకంతే కావాలి. మనం యిలా వెళ్దాంపదండి...ఆ గేటు దాటుతూనే క్యాంటీనుంది..." అంది.

"అక్కడెవరున్నారు?" అన్నాడు రమణ జీరబోయిన గొంతుతో. సరళ అతణ్ణి పట్టించుకోలేదు. "మా సత్యవతీ మిస్సు లీవు పైన వుందట. యెఫ్ ఐపీనో యేదో - రీసెర్చి చేస్తోందట... యీ వయస్సులో ఆమెకిదేం పిచ్చి చెప్పండి! మా అమృతవల్లి మేడమ్ కనబడితే మాట్లాడుతూ వున్నానింత సేపూ! భలే మంచి మేడమ్. ఆ పక్క స్టాఫ్ రూంలో మిరియం మేడమ్, సంధ్య మేడమ్ వున్నారని చెప్పిందామె. మీకు బోరు కొడుతూందేమో అని వాళ్ళను కలవకుండా వచ్చేశాను. రండి కాఫీ తాగాక వాళ్ళనోసారి పలకరిద్దాం." క్యాంటీను కెళ్ళికూచునే వరకూ సరళ చెబుతూనేవుంది.

క్యాంటీనులో వొకరిద్దరు స్టూడెంట్లు మాత్రమే వున్నారు. పాపాయిని అతడి చేతికిచ్చాక నేరుగా కౌంటరు దగ్గరికెళ్ళి అక్కడున్న అమ్మాయితో సీరియస్‌గా యేదో మాట్లాడసాగింది సరళ. పాపాయికి మెలకువ వచ్చి మెల్లగా రాగం తీయసాగింది. వేడివేడి కప్పుల్ని రెండు చేతుల్తోనూ పట్టుకుని దగ్గరికొచ్చాక "యిక్కడంతా సెల్ఫ్‌సర్వీసు....అప్పుడు మీరాబాయి అనే ఆవిడ రన్‌చేసేదీ క్యాంటీను...పద్మిని అనే పిల్ల టోకన్లు యిచ్చేది. యిప్పుడు వాళ్ళెవరూలేరు..." అంది. రెండుసార్లు కాఫీని చప్పరించాక" యెంతబాగుందిగదా!....అదీ మాక్యాంటీను కాఫీ అంటే..." అంటూ పరవశంగా సగం కళ్ళుమూసుకుని కాఫీరుచిని ఆస్వాదించసాగింది. "మాదేంజరస్ సిక్స్‌ను తిండిపోతులని అందరూ కుళ్ళుకునే వాళ్ళు. మాస్వప్న డేస్కాలర్‌గదా! యింటినించీ కారియర్ తెచ్చేది. క్లాసులో లాస్టుబెంచీలో కూర్చుని

మేము లంచ్‌టయానికి ముందే ఆకారియరు ఖాళీ చేసేసేవాళ్ళం...మధ్యాహ్నం దాన్ని హాస్టలుకు తీసుకెళ్ళేవాళ్ళం.మాట్రిన్‌కు తెలియకుండా మీల్స్‌ప్లేటు తీసుకొచ్చి పెట్టేవాళ్ళం...."

"యిక వెళ్దామా?" అంటూ పైకిలేచాడు రమణ.

"ఆగండాగండి...పక్కనే మా స్టూడెంటుకో ఆపరేటివ్ స్టోర్సుంది. దాంట్లో పద్మజుండాలి...వొకసారి పలకరించివస్తాను" అంది సరళ.

రమణ తిరిగిచూడకుండా కాంటీను బయటికొచ్చి నిల్చున్నాడు. క్యాంటీను లోపలికెళ్తున్న మేడమ్‌లు యిద్దరు అతడికేసి అనుమానంగా చూస్తున్నారు. కాలేజీ భవనాన్ని ప్రదక్షిణం చేస్తున్నట్టుగా చిన్న లారీ వొకటి హాస్టలుకేసి వెళ్తోంది.

"పద్మజకు పెళ్ళయిపొయ్యిందటండీ..." కేరింతలు గొడుతూ పరిగెత్తుకొచ్చింది సరళ. "వాళ్ళ హజ్బెండుది బెంగుళూరట. బాంకులో కాషియర్...యెంతో లక్కీగదా! ఆగండాగండి! అటుగాదు. యిటువెళ్దాం పదండి.... యీ పెద్ద బ్లాకే మా హాస్టలు. రూంనెంబర్ వన్‌టల్వ్...అదే మా పాలెస్ ... ఫైనలియర్లో దాన్లోనే వున్నాం...అదిగో ఆ చెట్టుకొమ్మ దగ్గరుందే కిటికీ – అదే మా రూంవిండో! విజిటర్స్ అవర్సప్పుడు మా సుజాత వాళ్ళ కజిన్ రాజు కోసం అక్కడే కూచుని యెదురుచూసేది! యీ సిమెంటు బెంచీని చూడండి. యిది మా నూర్జహాన్ ఫేవరేట్‌ప్లేసు.... యిక్కడ కూచుని చదివే మూడు సంవత్సరాలూ పరీక్షలురాసింది. ఫస్టుక్లాసు....అదిగదిగో అటుచూడండి..ఆపెద్దక్రోటను మొక్క మా జయనాటిందే..యెంత పెద్దదయ్యిందోగదా! మీరిలాకూచోండి..యిది విజిటర్స్‌రూం. మిమ్మల్నెవరూ వద్దనరు...నేనలా లోపలికెళ్ళి మాట్రిన్ను పలకరించివస్తాను...మరేం కంగారుపడకండి...యిక్కడ ప్రతి రాయీ, చెట్టూ, కుర్చీ, టేబులూ, ఫోటో, గీటో అన్నీ మాఫ్రెండ్సే!..."

పాపాయితో బాటూ రమణ విజిటర్స్ రూం కుర్చీలో కూచోకమునుపే సరళ వరండాలోకెళ్ళి, మెట్ల మీదుగా మిద్దెపైకెళ్ళిపోయింది.

స్టూడెంట్లందరూ కాలేజీకెళ్ళి పోవడం చేత హాస్టలు నిర్మానుష్యంగా వుంది. విజటర్స్‌రూం కిటికీలోంచీ ఖాళీగావున్న రోడ్డు మాత్రమే కనబడుతోంది. రమణ కొకసారిగా తాను చదువుకున్న కాలేజీ, హాస్టలూ గుర్తుకొచ్చాయి. గోడగడియారం కేసి చూశాడతను. పెద్దముళ్ళూ చిన్నముళ్ళూ ఆలింగనం చేసుకుంటున్నాయి. తిరుచానూరు పెళ్ళిమంటపం దగ్గర యీసరికి తన స్నేహితులంతా చేరి పోయివుంటారేమోనన్న వూహరాగానే అతను చికాకుగా మేడమెట్ల వైపుకు చూశాడు. కాలం నడవడం మానేసినట్టుగా తోచడంతో మళ్ళీమళ్ళీ విసుగ్గా గడియారాన్నే కొరికేసేలా చూడసాగాడు.

"మా వన్‌టల్వ్ లాక్ చేసుకుపోయారండీ!" ముందుమాటలు వినవచ్చాయి. తర్వాత చెమటలు కక్కుకుంటూ సరళా కనిపించింది "లక్కీగా విండో తలుపులు తెరిచేసిపోయారు. వోసారి కిటికీ కమ్మల్ని పట్టుకుని, జిమ్ చేస్తున్నట్టుగా పైకి జంప్ చేసి, రూంనంతా చూసేదానికి ట్రయిచేశాను. రూమంతా గలీజుచేసి పారేశారండీ....వట్టి కంట్రీబ్రూట్స్‌లాగున్నారు. డీసేన్సీ లేదూ యేంలేదు. మా శైలూ గోడకు యెంచక్కా జలపాతం పోస్టరతికించింది. వీళ్ళెవరో గొరెలాగుండే గడ్డంజీబోతుల పోస్టరతికించారా చోట్లో... మేం దేవుడి ఫోటోలుపెట్టిన చోట్లో చెప్పులున్నాయి...ఛీ....ఛీ...మా రూమంతా పాడయిపొయ్యింది. అసలు యీ వార్డెనేంచేస్తోంది? యెవరికి పడితేవాళ్ళకు రూమలాట్ చేయడమేనా?.."

"నీకు పుణ్యముంటుంది. యిక యిక్కడ యింకో సెకండయినా వుండలేన్నేను... కావలిస్తే నువ్వుండు. నేను గేటు బయటే పడిగాపులు పడతాను. రావడానికైతే అడ్డు పడతారుగానీ, పోతానంటే యెవ్వడూ కాదనరు గదా! నేనెళ్ళిపోతాను సరళా!" రమణ చిన్నపిల్లాడిలా గింజుకున్నాడు.

సరళ భర్తకేసి జాలిగాచూస్తూ "ఆ చివర్లో శ్రీదేవీ బ్లాకుంది. దాంట్లో రెండేళ్ళున్నాన్నేను... వొకసారిదాన్ని గూడా..." అని సాగదీసింది.

"నథింగ్ డూయింగ్...." విసురుగానడచాడు రమణ.

"పోనీ కాస్సేపు ఆ లాన్‌లో కూర్చుందాం...యెవరైనా అడిగితే క్లాసుకెళ్ళిన రిలేటివ్ కోసం వెయిట్ చేస్తున్నామని చెబ్దాం..ప్లీజ్.."

"బేబీకీ పాలుపట్టవా? యీ బాటలెప్పుడో ఖాళీ అయ్యింది..."

"ఆ బెంచీ పైన కూర్చుని పాలుకలిపేస్తాను...." సరళ బాస్కెట్‌లాక్కుని చెట్టునీడలో సిమెంటు బెంచీపైన కూచునేసింది...

సైకిలు స్టాండు దగ్గర ఆడవాళ్ళసైకిళ్ళు వరసగా నిల్చున్నాయి. క్యాంటీను నుంచీ ఆడపిల్లల గుంపొకటి కాలేజీకేసివెళ్తోంది. యెండ చెట్లకిందికి రావడానికి పోరాటం చేస్తోంది. హాస్టలు ముందో లావుపాటి స్త్రీ గిన్నెలనెత్తుకుని వెళ్తోంది.

"యీ అల్లిరాణి దర్బార్లో నేనుండలేను పోదాంపద...లక్కీగానేనెప్పుడూ యీలాంటి వుమెన్స్ కాలేజీకి రాలేదు...యిదేం కాలేజీ?..వొకమగపురుగును లోపలికి రానీకుండా కోట కట్టేశారేమీరు? కొంపదీసి వీళ్లు పెండ్లిగూడా ఆడాళ్లనే చేసుకుంటారా?" రమణ యెందుకో భయంతో వణికిపోతున్నాడు.

"అలా చేసినా బావుండేదేమోలెండి!" సరళ నిష్ఠూర పోవడంతో రమణ వులిక్కి పడ్డాడు. "మా ఆడవాళ్ళలా మీకు ప్రేమలూ, స్నేహాలూ వుండవు. వుత్త రాతి గుండెలుమీవి..హూ! మాశైలూ...మాజయా.....మానూర్జహాన్... సుజాత...యెన్ని కబుర్లు...యెన్ని తిరుగుళ్ళు..యెంత హడావుడి...యెంత ఆనందం!" సరళ గొంతు బాగా జీరబోతోంది. "యెంత క్లోజ్‌గావుండేవాళ్ళం మేం! లీవుల్లో గూడా విడిచిపెట్టేవాళ్ళంగాదు. అందరూ యెవరో వొకరింటికి కలిసికట్టుగా వెళ్ళేవాళ్ళం. యెప్పుడూ గ్రూపే! రూంలో వుండే వస్తువులన్నీ అందరివే! సారీస్, డ్రస్సులూ, మిర్రర్లూ, దువ్వెన్లూ, పేస్టులూ – అన్నీ కామన్‌ప్రాపర్టీనే! మనిఆర్డరువస్తే డబ్బు అందరిదీ. యెవరికి వచ్చినా లెటర్లు అందరూ కలిసి చదువుకునే వాళ్ళం...కలిసే రిప్లయిరాసేవాళ్ళం. నో సీక్రెట్స్...అందరియిండ్లల్లో వుండే వాళ్ళూ మాకు స్వంతవాళ్ళనే అనుకునేవాళ్ళం...మాశైలూకు వాళ్ళబావ లెటర్లురాసేవాడు. మేమంతా దగ్గరకూర్చుని దాని దగ్గర రిప్లయి రాయించేవాళ్ళం. విజిటర్స్‌డే రోజున అతనొస్తే అందరమూ పనిగట్టుకుని చుట్టూకూచునేవాళ్ళం! వొంటరిగా కలవలేదని అయనగారు అలిగేవాడు. 'మాఫ్రెండ్సుకంటే నువ్వెక్కువా?' అని శైలూదెబ్బలాడేది. వాళ్ళిద్దరికీ రాజీ చేసేసరికి మా తలప్రాణం తోకకొచ్చేది. మా జయ యెప్పుడుపడితే అప్పుడు రాత్రుల్లో గుండెనొప్పని లేచికూర్చునేది. యిక దానికి సపర్యలు చేస్తూ రాత్రంతా జాగరణచేసేవాళ్ళం. వోసారి లీవులైపోయాక నూర్జహాన్ యింటి నుంచీ రెండు రోజులు లేటుగా వచ్చింది. నేనలిగాను. మళ్లీ మాకు సంధి కుదిరినప్పుడు రూమంతా భలే హడావుడి! మంచాలన్నీ వొకటిగా కలుపుకుని పడుకుని, రాత్రంతా కబుర్లు చెప్పుకునేవాళ్ళం..యెంత యెంజాయ్‌మెంటు...గోల్డన్‌డేస్...."

గొంతు బొంగురు పోవడంతో కాస్సేపు మౌనంగా వుండిపోయింది సరళ. అయిదు నిముషాల తరువాత మళ్లీ చెప్పసాగింది– "కాలేజీ వదిలేశాక గూడా మినిమమ్ సంవత్సరాని కొకసారయినా కలుసుకోవాలని వొట్టేసుకున్నాం. యెప్పుడు? మా జయ కచ్చితంగా ఆగష్టు ఫిఫ్టీన్త్, పుట్టింది. సరిగ్గా ఆరోజు కలవాలని డెసిషన్ తీసుకున్నాం. అప్పుడోసారి జయ బర్త్‌డేకి సూజాత లేదు. యేదోపనిమీద వూరెళ్ళింది. ఆ రోజు జయ మంచినీళ్ళు గూడా ముట్టలేదు. సుజాత ఆ నెక్స్‌ట్‌డే హాస్టలు కొచ్చేదాకా మేమంతా వుపవాసమే! ఫైనలియర్ యెగ్జామ్స్ తర్వాత అందరూ వూళ్ళకెళ్తున్నప్పుడు మా యేడుపుల్ని చూసి హాస్టలు హాస్టలంతా దంగైపోయింది. శైలూ పెండ్లికి యిన్విటేషను పంపితే, యింట్లో పోట్లాడి మరీ వెళ్ళాను. జయ, సుజాత అందరూ వచ్చారు. నూర్జహాన్‌రాలేదు. శైలూపెళ్ళిపీటలపైన కూర్చుని కన్నీళ్ళు పెట్టుకుంది. కాలేజీ వదిలిపెట్టిన తర్వాత వచ్చిన

ఆగష్టు ఫిఫ్టీన్తుకు అందర్నీ వాళ్ళింటికి రమ్మని జయ లెటర్లురాసింది. సరిగ్గా అదేరోజున నన్నుచూట్టానికి మీరొచ్చారు. పెళ్ళికి యిన్విటేషను పంపితే జయమాత్రమే వచ్చింది. మిగిలినవాళ్ళెవరూరాలేదు. యెవరెవరికి పెళ్ళిళ్ళయ్యాయో, యెక్కడున్నారోగూడా తెలియదు. ఛీఛీ..ఫ్రీడంలేకుండా యీ మాదిరి ఆడజన్మ పుట్టేకంటే అడివిలో మానైపుట్టేదే మేలు!..”

లేచినడుస్తున్న రమణ వెంటే సరళకూడా మౌనంగా బయల్దేరింది. ఘూర్ఖా రాంలాల్ గురించి ఆరా తీస్తుందేమోనని గేటుదగ్గర కంగారుపడ్డాడు రమణ. బేరమాడకుండా రిక్షా యెక్కిన భార్యకేసి విస్తుపోయి చూశాడతను...హోటలుకు తిరిగిరాగేనే భోజనానికి కూచున్నారిద్దరూ. తినకుండా ప్లేటునలాగే వదలిపెట్టి గదికేసి వెళ్ళిపోతున్న భార్యకేసి విద్దూరంగా చూశాడతను. అతను గదికెళ్ళేసరికి సరళ పడకపైన అటుకేసి తిరిగి పడుకునివుంది.

తిరుచానూరు కెళ్తున్నప్పుడు కూడా సరళ ముభావంగానే వుంది. యెందుకైనా మంచిదన్నట్టుగా రమణ ఆవిడను పలకరించే సాహసంచేయలేదు.

పెళ్ళిమంటపం ముందు షామియానాలో కూర్చున్న స్నేహితుడొకడు “చీఫ్ గెస్ట్ గదా! లేటుగా వస్తేనే గొప్ప! పూర్ణ కుంభ మెక్కడ? యేనుగెక్కడ?” అంటూ స్వాగతం పలికాడు.

“పెళ్ళి స్వయంగా చేయిస్తానన్నాడండి యీ పెద్దమనిషి! యిప్పుడొస్తున్నాడు.” పెళ్ళికొడుకు ప్రేమగానే కోప్పడ్డాడు.

“వీడికయితే లక్ష్యంలేదు. నువ్వయినా ముందుగా లాక్కురాలేకపోయావామ్మా!” మరో స్నేహితుడు ‘త్రూ ప్రాపర్ చానల్’ లో సంధించాడు.

“నావైపు నీ వైపును చూపించమని చంపేస్తోందిరా నాయానా! యిదిగో మేడమ్! యిలారావాలి! మా రమణగాడొచ్చేశాడు” అంటూ మరోస్నేహితుడు కేకేశాడు.

సరళను స్త్రీల జట్టుకు అప్పగించాక రమణ పెద్దగా వూపిరి పీల్చుకున్నాడు. శేఖర్, ముకుందం, చైతన్య, గోపీ, భాషా, జాన్సన్ – అందరూ కమ్ముకున్నారు. తిరుచానూరు బస్టాండులో టీ బంకులో టీలుతాగి, ఆడపెళ్ళివాళ్ళని బెదిరించి రెండుసార్లు టిఫిన్లు దట్టించి, పెండ్లికొడుకుగదిలోనే పేకాట ప్రారంభించి, సిగరెట్లతో హోమం చెయ్యించి, నిద్రకళ్ళతో పెండ్లి తంతునంతా చూసి, అంతలోనే పెళ్ళయిపోయిందా అంటూ అందరూ నిస్పృహలోపడిపోయారు. “బై రా! విజయవాడ రావాలిమీరిద్దరూ!” అంటూ రమణ స్నేహితుడి దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు.

"అవునవున్రా! పెళ్ళవుతూనే వీడు భార్యను తీసుకుని మా యింటికొచ్చినట్టుగా..." స్నేహితుడొకడు యెగతాళిచేశాడు.

నవ్వుకుంటూ ఆటో యెక్కాక "పాపాయికి పాలున్నాయా? యిక్కడేదైనా హోటల్లో తెచ్చుకుందామా?" అని సరళనడిగాడు రమణ.

"మేమిద్దరమూ యిదే ప్రపంచంలో వున్నామని యిప్పటికైనా గుర్తొచ్చింది!" అంటూ నిట్టూర్చింది సరళ.

యేదో చెప్పబోయి, అంతలో భార్యముఖంచూసి ఆగిపోయాడు రమణ. తిరుపతిలో భార్యను హోటల్లో కూచోబెట్టి పాలు కలపడానికి వేన్నీళ్ళు తెచ్చిపెట్టమని అడగడం కోసం కౌంటరు దగ్గరున్న వ్యక్తి దగ్గరికి వెళ్ళాడు. నీళ్ళగ్లాసుతో తిరిగొస్తూ భార్యకోసం వెతికాడతను. కుర్చీలోకూర్చున్న వ్యక్తి తన శ్రీమతి అవునో కాదో తేల్చుకోడానికి రమణకు చాలాసేపు పట్టింది.

యిప్పుడా కుర్చీలో యిద్దరు స్త్రీలున్నారు. వొకరివొళ్ళోయింకొకరు కూచుని, ప్రపంచాన్ని మరచిపోయి, పారవశ్యంలో తూలిపోతున్నారు. పక్కనే సూటేకేసు పట్టుకుని నిల్చున్న గుండుయువకుడు గూడా శిల్పంలా నిలబడి పోయివున్నాడు. యీ అనుకోని హడావుడి ధాటికి తట్టుకోలేక యేడుస్తున్న పాపాయి నెవరూ పట్టించుకోవడంలేదు

"అలా అక్కడే నిలబడిపోయారేమిటండీ! యిదెవరనుకున్నారు? మా శైలూ...మీ ఆయన్ని మా వారికి పరిచయం చెయ్యవేమేమొద్దూ! యీ పెద్దమనిషేనండీ మా శైలూవాళ్ళ బావ...." సరళ వుద్వేగంతో యెగసిపడుతోంది.

తానూకూచున్నాక "యిలాకుర్చోండి" అంటూ అతడికింకో కుర్చీచూపెట్టాడు రమణ.

"నమస్తే సార్! మాశైలూ మీ ఆవిడను తలుచుకోని రోజుండదు" అన్నాడు శైలజ బావ.

"నాకు నమ్మకం లేదు రవన్నా! యిది నన్నెప్పుడో మర్చిపొయ్యింది. నా పెండ్లికి గూడారాలేదు." సరళ కోపంగా చూసింది.

"నీ పెండ్లికి యిన్విటేషను పంపావా నువ్వు!" శైలజగూడా అంతే కోపంతో వురిమిచూసింది. "జయావాళ్ళకజినొకసారి నెల్లూరు బస్టాండులో కనిపించి చేప్పేదాకా నీకు పెళ్ళయిందేనే తెలియదు నాకు"

"నా చేత్తో అడ్రస్సురాసి పంపాను..."

"యేవూరికి?..."

"నెల్లూరుకే..."

"మన ఫైనలియర్ పరీక్షలయిన మూడునెలలకే మాడాడీకి హైద్రాబాదుకు ట్రాన్స్ఫరయ్యింది."

"ఆ సంగతి నాకు చెప్పావా నువ్వు?"

"పోనీ ఆ బ్యాంకువాళ్ళు మాకు రీడయిరెక్టుచేసుంటారు గదా!.."

"ముందుగా పోస్టల్ వాళ్ళనూ, ఆ తర్వాత బ్యాంకునూ కోర్టుకు లాగుదాంగానీ, యిప్పుడా గొడవెందుకు? హాయిగా కబుర్లు చెప్పుకోక....." రమణ అనునయించాడు.

"తిరుపతికెప్పుడొచ్చారు? యెస్పీడబ్లూకెళ్ళావాలేదా?" సరళ ప్రసక్తిమార్చింది.

"యీ మొక్కుబడి లాంగ్ పెండింగ్ సార్! నిన్న వుదయం రాయలసీమలో దిగాం... నిన్ననే దర్శనమయి పొయ్యింది. పొద్దున్న గోవిందరాజుల గుడికీ, తిరుచానూరుకూ వెళ్ళొచ్చాం...మధ్యానం నాలుగున్నరకు రాయలసీమకెళ్ళాలి.....రిజర్వేషన్లన్నీ హైద్రాబాదులోనే అడ్వాన్సుగా చేసేశాను" శైలజబావ సమాధానం చెప్పాడు.

"యిప్పుడు టయిం వొకటిన్నర...హార్డ్లీ త్రీ అవర్సుంది. యింత అర్రీబుర్రీగా కుదరదు..యెలాగైనా యీరోజాగిపోండి. రేపు పోదువుగానీ!..." ప్రాధేయపడింది సరళ.

"సారీ సిస్టర్! రేపు హాస్పిటల్లో డ్యూటీకి అటెండ్గాక పోతే మా సూపరిండెంట్ గింజుకుచస్తాడు...యీ రెండు రోజుల లీవుకే నానా హంగామా చేశాడు. అయినా విజయవాడ నుంచీ హైద్రాబాదెంత దూరం చెప్పు? వోసారి మీరిద్దరూ తప్పకుండా రావాలి" అన్నాడు శైలజ బావ.

"అవునే... యీసారి కుదరదు....మరోసారి కలుద్దాం?" శైలజ నీరసంగా అంది.

"ఆఫ్టర్ త్రీయియర్స్...యిప్పుడు కలిశాం...మళ్ళీయెప్పుడు కుదురుతుందో?...." సరళ కస్సుమంది.

"నువ్వుత్తరాలు రాస్తేగదా!...నీకు బద్ధకం..."

"నువ్వు అడ్రస్సు యిస్తే గదా! నీకు నిర్లక్ష్యం..."

"తెలుసుకోవాలంటే తెలుసుకోలేవా?"

"చెప్పకుంటే యెలాతెలుస్తుంది?..."

స్నేహితురాళ్ళిద్దరూ కీచులాడుకోసాగారు.

"ముందు కాఫీ అయినా తాగండి. రూంకెళ్ళి తీరిగ్గా పోట్లాడుకుందురుగానీ...." రమణ హెచ్చరించాడు.

"యిప్పుడు రూంకొద్దు...లగేజీ అంతా క్లోక్రూంలో వుంది. అందరూ రైల్వేస్టేషనుకెళ్దాం...రైలొచ్చేవరకూ మీరు మాట్లాడుకోవచ్చు" అన్నాడు శైలజబావ.

స్నేహితురాళ్ళిద్దరినీ రైల్వే ప్లాట్‌ఫాంపైన సిమెంటు బెంచీలో కూచోబెట్టి శైలజబావతో బాటూ క్లోక్‌రూం కెళ్ళాడు రమణ. వీలయినంత ఆలస్యంచేశాక మగాళ్ళిద్దరూ తీరిగ్గా సామాన్లు తీసుకుని తిరిగొచ్చారు. ఆడవాళ్ళిద్దరూ వొకరి కన్నీళ్ళుమరొకరు తుడుచుకుంటూ కనిపించారు.

రమణ దగ్గరికి రాగానే అతణ్ణి వాటేసుకుని భోరుమని యేడ్చేసింది సరళ. చుట్టూ వున్న జనమంతా తమనే చూస్తున్నట్టుగా అనిపించడంతో రమణ బెంబేలు పడిపోయాడు. "యేయ్..యేమిటిది? చూడు..వాళ్ళెలాచూస్తున్నారో!" అంటూ భార్యను సముదాయించడానికి ప్రయత్నించాడు రమణ.

"మా జయ...జయ..." సరళ వెక్కిళ్ళు పెట్టసాగింది.

"మాఫ్రెండు జయ ఆమధ్య పోయిందండీ! సంవత్సరమయిపొయ్యింది. తను హార్ట్‌పేషెంటు...యింట్లో యేవో గొడవలు..తట్టుకోలేకపోయింది...ఆ విషయం దీనికింత వరకూ తెలియదు...నేను చెప్పేసరికి తట్టుకోలేకపోతోంది" అంది శైలజ రుమాలుతో కళ్ళు తుడుచుకుంటూ.

శైలజ బావ ఫ్లాస్కుతో కాఫీ తీసుకొచ్చాడు. శైలజ పాపాయిని తన వొళ్ళోకి తీసుకుంది. రమణ భార్యచేత బలవంతంగా కాఫీ తాగించాడు. ప్లాట్‌ఫాంపైకి రాయలసీమ యెక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది.

"నూర్జహాన్ సంగతేమైనా తెలిసిందానీకు?" సరళ ముక్కు చీదుకుంటూ అడిగింది.

"దాని పెళ్లి గురించి వాళ్ళింట్లో పెద్దగొడవయ్యిందట! దాంతో యెంయేలో చేరిందట! యిప్పుడు యెక్కడో రీసెర్చీ చేస్తోందని వాళ్ళ అన్నోసారి కడపలో కనిపించి చెప్పాడు... నా అడ్రస్సు యిచ్చి, దానికిచ్చి వుత్తరం రాయమని చెప్పమన్నాను. అదింతవరకూ రాయలేదు.." శైలజకూడా దిగాలుగా జవాబు చెప్పింది.

"సుజాత...?"

"మారేజ్ చేసుకుందని తెల్సింది. యిన్విటేషనయినా పంపలేదా గాడిద..."

"మేరీ?..."

"కాన్వొకేషనప్పుడు కలవటమే! తర్వాత కనిపించలేదది..."

"అడ్రస్సు లేదా?..."

"నా ఆటోగ్రాఫ్‌బుక్ యెక్కడో పోయింది. నీ దగ్గరుందా?"

"మా అమ్మావాళ్ళయింట్లో వుండాలి. యీసారెళ్ళినప్పుడు తప్పకుండా వెతకతాను."

సామాన్లను రైల్లో సర్దడంలో సహాయంచేశాక "యికనైనా వాళ్ళిద్దర్నీ లేవమని చెప్పండి. లేకపోతే మీరొక్కరే హైద్రాబాదుకెళ్ళాల్సి వుంటుంది" అన్నాడు రమణ

"సిగ్నలిచ్చేశారు.." అంటూ శైలజబావ అరిచాడు. స్నేహితురాళ్ళిద్దరూ మరోసారి వాటేసుకున్నారు. తర్వాత నీరసంగా పైకిలేచిన శైలజ కాళ్ళకేసి చూసి" నీ యెలివేటర్స్ మానేసి నట్టున్నావేమే!" అంది సరళ కంగారుగా.

గొంతుతగ్గించి "మా బావా హైటూ, నాహైటూ వొకటే! యెలివేటర్స్ తొడుక్కుంటే నేనే హైట్‌గా వుంటానని.." అంటూ శైలజ కన్నీళ్ళు తుడుచుకుంటూనే సిగ్గు పడిపోయింది. నడవబోతూ తూలిపడిపోబోయిన సరళను గట్టిగా పట్టుకుంటూ శైలజ కళ్ళెగరేసి యిదేమిటన్నట్టుగా చూసింది. "మా ఆయన్ని చూళ్లేదూ! జెండాలా యెంతపొడుగో!" అని తానూ సిగ్గుపడుతూ తనహైహీలు జోళ్ళు కనబడకుండా చీరకుచ్చిళ్ళు లాగింది సరళ.

రైలెక్కాక గబగబా వెళ్ళి తనకిటికీ పక్కనకూచుని "హైద్రాబాదుకు వెంటనే రాకపోతే చంపేస్తాను" అంది శైలజ యేడుపుగొంతుతో

"విజయవాడకు రాకపోతే.." యేడుస్తూనే సరళ పళ్ళునూరింది.

రైలు నిర్లక్ష్యంగా కూతకూసింది.

మాటలు పెగలకపోవడంతో స్నేహితురాళ్ళిద్దరికీ పెదవులు మాత్రమే కదులుతున్నాయి. యిద్దరి కళ్ళల్లోంచీ కన్నీళ్లు ధారగా కారిపోతున్నాయి. కలిసిన వాళ్ళ చేతుల్ని దూరంగా లాగుతూ రైలు కదిలింది. శైలజ చేతుల్లోంచీ విడివడిన చేతినలాగేపైకెత్తి "బై...బై...బై"అంటూ వీడ్కోలు చెప్పడానికి ప్రయత్నించింది సరళ. దూరంగా రైలు మలుపుతిరిగే వరకూ సరళ చేయివూపుతూనే వుంది. ప్లాట్‌ఫాం వొక్కసారిగా బోసిపోయింది. తమ వాళ్ళను రైలుకప్పగించిన జనమంతా మెల్లగా బయటికివెళ్ళిపోతున్నారు. "త్వరగా వెళ్ళాలి మనం. తిరుమలకెళ్ళేందుకు బస్సో, టాక్సీనో వెతుక్కోవాలి...." అంటూ పాపాయినెత్తుకున్న రమణ వెనుదిరిగాడు.

రైలు విడిచి పెట్టిపోయిన పట్టాల దగ్గర యేదో జారవిడుచుకున్న దానిలా అటే చూస్తూ వెనుతిరిగింది సరళ.

హోటలుకెళ్ళే వరకూ యెవరూమాట్లాడలేదు.

గదికెళ్ళగానే పడకపైన సోలిపోయి "ప్రతి సంవత్సరమూ ఆగష్టుఫిఫ్టీన్త్ కలవాలని ప్రామిస్ తీసుకుందిగదా! యిప్పుడిలా ప్రామిస్ బ్రేక్‌చేసి యెలాగెల్లిపోయిందో చూడండి.." అంటూ మరోసారి యేడుపు మొదలుపెట్టింది సరళ....

కుర్చీలో కూర్చుని సిగరెట్టు వెలిగించుకున్నాక "దటీజ్ లైఫ్...." అంటూ గాఢంగా నిట్టూర్చాడు రమణ... "మేం యెమ్మే చేసేటప్పుడు లక్ష్మీపతి అనే ఫ్రెండుండేవాడు. తన కోసమని యేమీ ఆలోచించకుండా తన మనీనంతా నాకోసమే స్పెండ్‌చేసేవాడు...పిక్‌నిక్ కని మహాబలిపురం వెళ్తే అక్కడ స్నానం చేస్తూ మునిగిపోయాడు...ప్ఫ్...వాడు బతికుంటే నాకిలా ప్రయివేట్ హాస్పిటల్లో వుద్యోగం చేయాల్సిన అవసరం వుండేదిగాదు. అంతా మన ప్రాప్తం...అంతే!..."

జీరబోతున్న రమణ గొంతుకనుపట్టించుకోకుండా "నాక్లోజెస్ట్ ఫ్రెండ్ శైలూనిలా యాక్సిడెంటల్‌గా మాత్రమే కలిశాను. నా బెస్ట్‌ఫ్రెండ్ జయ చచ్చిపోయిన సంగతి సంవత్సరందాకా తెలియదు. ఛీ...పాడూ ఆడజన్మ! అదే మీరయితే ఫ్రెండు పెండ్లి జరిగితే పెళ్ళాలతో బాటూ బయల్దేరతారు. మేం రమ్మంటే అదనీ యిదనీ కుంటిసాకులు చెప్తారు. ఫ్రీడంలేకుండా యిలా బతకాల్సిందేనామేము?" అంటూ సరళ యేడుపుగొంతుతోనే గింజుకుంది.

భార్యకేసి కళ్ళు చిట్లించుకుని చూశాక రమణ చూపులు మరల్చుకున్నాడు. కిటికీలోంచీ యెటో "చూస్తూ వచ్చే నెలలో హైద్రాబాదులో ట్రెయినింగ్ వుండచ్చు. అప్పుడు వెళ్దాంలే! అన్నట్టు శైలజ అడ్రస్సు తీసుకున్నావు గదానువ్వు?" అని అడిగాడు రమణ.

సరళ వులిక్కిపడి, ధిగ్గునపైకిలేచి "మీరంతసేపు మాట్లాడుతున్నారుగదా! వాళ్ళ బావ దగ్గర అడ్రస్సు తీసుకోలేదా?..." అని ప్రశ్నించింది.

చివాలున సమాధానమేదో చెప్పబోయిన రమణ ఆగిపోయాడు. రెండుమూడు నిముషాల తర్వాత "మసాబ్‌టాంక్ దగ్గరో యెక్కడో హాస్పిటల్ అన్నాడు. తెలుసుకుంటాన్లే!" అన్నాడు. మరికాస్సేపయ్యాక "మళ్లీ యెప్పుడో!" అని గొణిగాడు.

"యేమిటి?" పాపాయిని నిద్రపుచ్చడంకోసం చిచ్చుకొడుతూన్న సరళ దిగాలుగా అడిగింది.

"అదే!...మళ్లీ మీశైలూయెప్పుడు కలుస్తుందో..." అన్నాడు రమణ సిగరెట్టు పీకను ఆష్ట్రేలోపడేసి నలుపుతూ.

"మళ్లీ యెప్పుడో...మళ్లీ యెక్కడో..." జీరబోయిన కీచు గొంతుకతో సరళ గొణిగింది.

24.7.85 X 31.7.85 ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక